క్లుప్తంగా

చట్టపర దత్తత శ్రేయస్కరం



చిన్నారిని దత్తత ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): చట్టపరంగా దత్తత తీసుకోవడం పిల్లలు లేని దంపతులకు శ్రేయస్కరమని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న ఏడు నెలలు వయసు గల రామ్ చరణ్ అనే బాబును కేరింగ్స్ ద్వారా నాలుగేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్న పిల్లలు లేని తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన దంపతులు సర్గం ఆంజనేయులు, గాయత్రిలకు గురువారం కలెక్టర్ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దత్తత నిబంధనలపై విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్యచక్ర వేణి, శిశు గృహ మేనేజర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్స్‌తో అనారోగ్యం



మాట్లాడుతున్న పీడీ శారద

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జంక్ ఫుడ్స్ తీసుకోవడంతో చిన్నారులకు హాని చేస్తాయని ఐసీడీఎస్ పీడీ శారద అన్నారు. గురువారం ఎన్ఆర్‌పేట సచివాలయం పరిధిలో 8వ రాష్ట్ర పోషణ మాసోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి ఐసీడీఎస్ పీడీ శారద మాట్లాడుతూ చక్కెర, నూనె వినియోగం తగ్గిస్తే స్థూలకాయాన్ని నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పరామర్శ



హాస్పిటల్‌లో పరామర్శిస్తున్న జేపీ, నాయకులు

ఏలూరు టౌన్: అస్వస్థతతో ఏలూరులో హాస్పిటల్‌లో వైద్య చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా బీసీ సెల్ కార్యదర్శి భోగాది ప్రభాకర్ తండ్రి భాస్కరరావును ఆ పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జేపీ వెంట నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, సూకపెయ్యి సుధీర్‌బాబు, నెరుసు చిరంజీవి, గాజుల బాజి, కొల్లిపాక సురేష్, ఎచ్చర్ల ఉమామహేశ్వరరావు, బసవ తదితరులు ఉన్నారు.

కానరాని సాంస్కృతిక ప్రదర్శనలు

- కళాకారులకు గడ్డు పరిస్థితులు
- ఉత్సవాల్లో డీజేలు, బాణసంచా కాల్పులకే ప్రాధాన్యత



పౌరాణిక నాటక ప్రదర్శనలో కీలక ఘట్టం (ఫైల్)



చిన్నారుల కూచిపూడి నృత్య విన్యాసాలు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సీతారాముల కల్యాణ మహోత్సవాలు, గణపతి నవరాత్రులు, దేవీ శరన్నవరాత్రులు వంటి పండుగలు అత్యంత ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కమిటీలు గతంలో పోటీపడేవి. ఈ ఉత్సవాల్లో భాగంగా పౌరాణిక నాటకాలు, శాస్త్రీయ నృత్యాలు, హరికథలు, బుర్రకథలు, తోలు బొమ్మలాటలు వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. ఆయా సాంస్కృతిక ప్రదర్శనలు దాదాపు తెల్లవారు జామున 4 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగేవి. భక్తులు భోజనాలు సిద్ధం చేసుకుని, ఎడ్ల బండ్లు కట్టుకుని వెళ్లి నాటి ప్రజలు నిద్ర సంగతే మర్చిపోయి ప్రదర్శనలను ఆశాంతం తిలకించేవారు.

కళలకు కొరవడిన ఆదరణ

గణపతి నవరాత్రి, శ్రీదేవీ శరన్నవరాత్రి, సీతారాముల కల్యాణ మహోత్సవాల నిర్వహణ తీరు నేడు పూర్తిగా మారిపోయింది. గతంలో సాంస్కృతిక ప్రదర్శనల స్థానాన్ని వీధి సినిమాలు ఆక్రమించాయి. అనంతరం వాటి స్థానాన్ని మ్యూజికల్ నైట్‌లు, రికార్డింగ్ డ్యాన్సులు ఆక్రమించగా, ప్రస్తుతం అవి కూడా తెరమరుగై డీజేలు, విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా పేలుళ్లు పెరిగిపోయాయి. పెద్దపెద్ద విగ్రహాలు పెడదాం, పెద్ద శబ్దాలు వచ్చే డీజేలు పెడదాం, ఇతరుల కంటే బాణసంచా ఎక్కుసేపు కాల్చుదాం అనే నేటి ఉత్సవ కమిటీలు ఆలోచిస్తున్నాయి తప్ప తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుగొమ్మలైన, తెలుగు జాతి కీర్తిని దశదిశలా వ్యాపింపజేయడంలో కీలకంగా నిలిచిన కళలను, వాటిని ప్రదర్శించే కళాకారులను ఆదరిద్దామనే ఆలోచన కొరవడిందని కళాప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులకు గడ్డు పరిస్థితులు

కళా ప్రదర్శనలపై నేటి యువత పెద్దగా ఆసక్తి చూపడంలేదు. ఇంటిలో భార్యాభర్తలిరువురూ ఉద్యోగాలు చేస్తుండడం, విద్యార్థులకు కనీస విశ్రాంతి, ఆటవిడుపుకు కూడా అవకాశం లేకుండా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు స్కూళ్లు, కాలేజీలు నడపడం, తల్లిదండ్రులు తమ బిడ్డలకు సంప్రదాయాల పట్ల అవగాహన కలిపించకపోవడంతో పౌరాణిక, సాంఘిక నాటకాలతో పాటు శాస్త్రీయ నృత్యాలు, హరికథలు, బుర్రకథలకు ఆదరణ పూర్తిగా కరువైంది. ఆయా కళలు అంపశయ్య పైకి చేరువయ్యాయి. ప్రజల్లో వచ్చిన మార్పుతో ప్రస్తుతం ఆయా కళాకారులు ఆదరణ లేక, ప్రదర్శనలు ఏర్పాటు చేసే వారు కానరాక గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. సాంస్కృతిక, కళా రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ తలోచేయి వేయాలని, ముఖ్యంగా ఉత్సవ నిర్వాహకులు ఈ ప్రదర్శనలపై దృష్టి సారించాలని కళాకారులు కోరుతున్నారు.

అవకాశాలు శూన్యం



వివిధ శాస్త్రీయ, జానపద కళాకారులకు ఒకప్పుడు ఉత్సవాలే జీవన భృతి కల్పించేవి. వినాయక చవితి, దసరా, శ్రీరామ నవమి, షష్టి, శివరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ ఒకరిని మించి ఒకరు కళాప్రదర్శనలు నిర్వహించి, కళాకారులను ఆదరించేవారు. నేడు ఉత్సవ పందిళ్ల వద్ద కళావేదికలు కనిపించడం లేదు. మన సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. కళాకారులకు అవకాశాలు లేవు.

– డి.హేమసుందర్, వ్యవస్థాపక కార్యదర్శి, అభినయ నృత్య భారతి సంస్థ

అంతరించిపోతున్న పద్య నాటకాలు



పౌరాణికాల్లో పద్య నాటకాలు తెలుగు ప్రజలకే సొంతం. కళాకారులు సుదీర్ఘ పద్యాలు పాడి ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకునేవారు. అటువంటి కళ నేడు అంతరించిపోతుంది. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, భగవద్గీత బతికి ఉన్నాయంటే అది కళాకారుల కృషే. అనేక మాధ్యమాలు, పాటలు, నాటకాలు, నత్యాలు, సంగీతం, జానపద కళలు వంటి ద్వారా తరతరాలకు అందిస్తున్నారు. వాటిని కాపాడుకోవాలి.

– మెతుకుమిల్లి సూర్యనారాయణ యాదవ్, రంగస్థల పౌరాణిక నాటక కళాకారుడు

కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ఏలూరు(మెట్రో): ఏలూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్టమైన ప్రణాళిక అమలు చేయాలని కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నిర్వహించిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీపీ) జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంలో 2024 – 25 సంవత్సరంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం క్రింద నగరంలో చేపట్టబోయే పనులపై సమీక్షించారు. నగరం, రూరల్ ప్రాంతాల్లోని బంకులను తనిఖీ చేసి పెట్రోల్, డిజిల్ నాణ్యత లోపిస్తే సీజ్ చేయాలన్నారు. నగరపాలక సంస్థలో గ్రీన్ వాహనాలు ఏర్పాటు చేయాలని, బ్యాటరీ వాహనాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. గాలిలో దుమ్ము, ధూళి శాతాన్ని పరీక్షించే డిజిటల్ డిస్‌ప్లే అక్టోబరు 10లోపుగా పూర్తిచేయాలని కలెక్టరు ఆదేశించారు. కాలం చెల్లిన వాహనాలను గుర్తించి సీజ్ చేయాలన్నారు. ఆర్టీఓ ఎం అచ్యుత్ అంబరీష్, ప్రాంతీయ కాలుష్య నియంత్రణా మండలి ఈఈ కె.వెంకటేశ్వరరావు, నగర కమిషనరు ఎ.భానుప్రతాప్, జిల్లా పరిశ్రమల అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా రోడ్డు ట్రాన్స్ పోర్టు అధికారి ఎస్ బి.శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ వై.వి.కిషోర్ బాబుజీ పాల్గొన్నారు.

ఆప్కో వస్త్రాలపై ఆఫర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం సరికొత్త వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 నుంచి 67 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆప్కో రాజమండ్రి మండల వాణిజ్య అధికారి కె.పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని నేత బజార్ భవనం, సీఆర్ రెడ్డి కళాశాల ఎదురుగా గల ఆప్కో విక్రయశాలల్లో ఆ ఆఫర్లు అందించనున్నట్టు పేర్కొన్నారు.

జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన



జీఎస్‌టీ సర్కిల్-2 కార్యాలయం వద్ద కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏలూరు టౌన్: జీఎస్‌టీ తగ్గింపుపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నామని వాణిజ్య పన్నుల శాఖ ఏలూరు సర్కిల్-2 అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని జీఎస్‌టీ సర్కిల్-2 కార్యాలయం వద్ద జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ విధానంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీలో తీసుకొచ్చిన స్లాబ్స్ విధానంపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. ఏలూరు జిల్లాలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 19 వరకు సూపర్ జీఎస్‌టీ సేవింగ్స్‌పై ప్రజల్లోకి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీఎస్‌టీ అధికారి కె.చిట్టిబాబు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ జి.జాన్‌బాబు, జీఎస్‌టీ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి



కృష్ణాజిల్లా ఇన్‌చార్జి అనిల్‌కుమార్‌కు దళితసేన కండువా కప్పుతున్న రవిప్రకాష్

ఏలూరు(ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రభుత్వం పునరాలోచించాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. గురువారం ఏలూరులో దళితసేన రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిలుపుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, వెనుబడిన వర్గాల మైనార్టీలకు, పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఉచితంగా వైద్యం అందించడంలోనూ కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కృష్ణాజిల్లా దళితసేన ఇన్‌చార్జి బూసే అనిల్‌కుమార్‌కి దళితసేన కండువా కప్పారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా దళితసేన ఇన్‌ఛార్జి బుల్లా రవి ఉన్నారు.

నగరం.. వీధుల్లో దుర్గంధం

ఏలూరు నగరంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం, డ్రెయిన్లలో మురుగునీరు ముందుకు పారక దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విజృంభిస్తున్నాయి. వర్షాకాలమైనప్పటికీ దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా పత్తేబాద పక్కనే ఉన్న వృద్ధాశ్రమం వద్ద డ్రెయినేజీలో మురుగునీరు ముందుకు పారడంలేదు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల పరిస్థితి ఇలాగే ఉంది. అధికారులు స్పందించి వ్యాధులు ప్రబలకు ముందే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



జీడీ కాలనీ డ్రెయిన్‌లో నిలిచిన వ్యర్థాలు



పత్తేబాద వృద్ధాశ్రమం డ్రెయినేజీ దుస్థితి



రాణినగర్‌లో పేరుకుపోయిన చెత్త



503. టైటస్ నగర్‌లో పేరుకుపోయిన చెత్త



రైతుబజారు వెనుకవైపు డ్రెయిన్‌లో చెత్త

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	40	బీన్లదిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	38
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	40	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	44
బీరకాయలు	36	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	03
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	27
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

అమ్మవార్లకు విశేష అలంకరణలు



పత్తేబాద కనకదుర్గమ్మ



పవర్‌పేట అన్నపూర్ణమ్మ



దొండపాడులో రాజరాజేశ్వరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల నాలుగో రోజు గురువారం ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు, అష్టోత్తర శత నామ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సీఆర్ రెడ్డి మహిళా కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాత్యాయని దేవి అలంకరణలో అమ్మవార్ని పూజించారు. కోలాటం, మెహంది, వివిధ రకాల స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీఆర్ఆర్ పాలకమండలి సెక్రెటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్, సీఈఓ కిషన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కాత్యాయనిగా బాలదుర్గాదేవి

ఏలూరు రూరల్ : ఏలూరు శాంతినగర్ ఏడో రోడ్డులోని బాలదుర్గాదేవి కత్యాయనిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూలు, బంగారు ఆభరణాలతో అమ్మవార్ని ముస్తాబు చేశారు.



బావిశెట్టి వారిపేట కనకదుర్గాంబ



కాత్యాయనిగా బాలదుర్గాదేవి



ఉత్సవాల్లో పాల్గొన్న కళాశాల ప్రతినిధులు, విద్యార్థినులు

గుడివాకలంకలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు : దోమల వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు సంభవిస్తాయని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. గురువారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో వైద్య సిబ్బందితో కలిసి ఫ్లెక్సీలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి నిల్వ ప్రాంతాల్లో వాడేసి ఇంజన్ ఆయిల్ చల్లాలని, సాయంత్రం సమయంలో కిటికీలు వేసుకోవాలని, దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రజలు మురికి కాలువలో చెత్త వేయరాదని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ శేషావతారం, హెల్త్ అసిస్టెంట్ యోహాన్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త విజయ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రణభేరికి ఉపాధ్యాయుల పయనం



రణభేరికి పయనమైన ఉపాధ్యాయులు

దెందులూరు: గుంటూరులో యూటీఎఫ్ రణభేరికి గురువారం ఏలూరు రూరల్ మండలం నుంచి యూటీఎఫ్ ఏలూరు మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు నంబూరి రాంబాబు, కనకదుర్గ, ఎస్‌కే ఎస్ మని, ఐఎఫ్, రవికాంత్, ఎస్‌కే బ్రోకన్, కేకేఆర్ స్వామి, సత్యవాణి, ఎస్ సుమశ్రీ, కె.దేవి ప్రసాద్ వెళ్లారు. వెంటనే పీఆర్‌సీ కమిషన్ వేసి ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఐఆర్ విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను దసరాకు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రసాదాలయానికి విరాళాలు



విరాళం అందిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేట షిర్డీ సాయి ప్రేమ మందిరం వెనుక స్థలంలో శ్రీ సాయి ప్రసాదాలయం, ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణ పనులకు భక్తులు గురువారం విరాళాలు సమర్పించారు. సాయి సేవకులు చిట్టి బొమ్మ ఆనందరావు, విజయలక్ష్మి దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే నీరుకొండ అప్పారావు, దుర్గ దంపతులు సాయిప్రసాద ఆలయానికి రూ.75,000 విలువగల టేకు గుమ్మాన్ని సమర్పించారు.

ప్రమాదం.. ఫుట్‌పాత్ ప్రయాణం



ఫుట్‌పాత్‌పై ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: కాలేజీ విద్యార్థులకు సరిపడా బస్సులు కేటాయించకపోవడంతో బస్సుల ఫుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తుంది. విద్యార్థులకు సరిపడేలా బస్సులు కేటాయించాలని వారు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ప్రతిరోజూ ఫుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.